పెద్దమనుష్యు లందరికీ ఒ ప్రశ్న

# తమరెందు కింకా బతికి ఉన్నారు?

"అమరశ్రీ"

"నీ జీవితోద్దేశ్యం ఏమిటి? అన్నాడు ఒక నాడు మిత్రుడు.

"నాకోసం పాటు బడటం" అన్నాను తాపీగా.

"అంటే?" మళ్ళా ప్రశ్నించాడు.

"నా తృప్తికోసం, నా క్షేమంకోసం, నా ఆరోగ్యంకోసం, మొత్తంమీద నాకోసం నేను బ్రతుకుతున్నాను."

"అంతేనా? మరేదో గొప్ప ఆశయాల కోస మనుకున్నాను." అన్నాడు, 'వడ్ల గింజ లోనిది బియ్యపు గింజ' అని తెలుసుకున్న వాడిలా.

"నాకోసమే నేను బ్రతకటం" అన్నాను మళ్ళా.

"ఎంత స్వార్థం" అన్నాడతను.

"అందరిలోనూ ఉన్నది."

"కొందరిలో ఉండదు."

"ఉండదని అనుకోవటంవరకే. ప్రతీవారి లోనూ ఉండి తీరుతుంది. తమలో స్వార్థం ఉన్నదని చాలామంది అంగీకరించరు. నేను మాత్రం అంగీకరిస్తాను" అన్నాను.

"అది లేనివాళ్లు లేరనుకోవటం నీ అల్పత్వాన్ని సూచిస్తుంది" అన్నాడు.

"లేదు."

"మరేమిటి?"

"అంగీకరించేటందుకు చాలామంది సిగ్గుపడతారు, భయపడతారు. గౌరవానికి భంగమనుకుంటారు. గౌరవాలలాటి వాటి బాధ నాకు లేదుగాబట్టి, నాలో స్వార్థం ఉన్నదనీ, నేను నాకోసమే బ్రతుకుతున్నాననీ అంగీకరిస్తాను."

"మరి గాంధీ, స్టాలిన్ మొదలైన నాయకుల సంగతేమిటి?" అన్నాడు.

"వాళ్ళలోను స్వార్థం ఉండితీరాలి. అందులోనూ ఒక దానిని సాధిద్దామనుకొనే వాళ్లలో స్వార్థం అధికం."

"ఎలా?"

"ఒక మానవు డున్నాడనుకో. అతనికి కొన్ని ఆశయాలుంటయ్. మనుషులను బట్టి ఆశయాలు మారుతాయ్. స్టాలిన్ ఆశయం ప్రజా క్షేమాన్ని చేకూర్చటం కావచ్చు. నాలాటి వాడి ఆశయం కలెక్టరాఫీసులో గుమాస్తా గిరీ సంపాదించటం కావచ్చు. కాని నాలాగే, స్టాలిన్ కూడా ఆశయ సిద్ధికోసం జీవితాన్ని ఉపయోగించటం స్వార్థం కాక మరేమవుతుంది?"

"స్టాలిన్ ఆశయ ఫలితాన్ని అనుభవించేది ప్రజలు గదా?"

"అవును. ప్రజలను సుఖింపజేయడమే ఆయన ఆశయం. ఆశయ ఫలితం ప్రజా క్షేమకరం కాని ప్రజా విద్రోహకరంగాని, మరేమైనాగాని, తన ఆశయంకోసం పాటుబడ్డాడు గనుక స్వార్థపరుడు."

"మరి స్వార్థరహితు డెలాటివాడు? అటువంటివాడుండటమనేది అసంభవం నీదృష్టిలో."

"కాదు. ఉండవచ్చు. కాని చాలాఅరుదు. స్టాలిన్ తన ఆశయాలన్నిటినీ వదిలి పారేసి, మరొక పంథాతొక్కి మరొకరి ఆశయాలకోసం పాటుబడిననాడు స్వార్థరహితుడవుతాడు."

"చాలా వింతవాదం" అన్నాడు ఒక్కసారిగా.

"కాదు. చాలా మామూలువిషయం. అంగీకరించా లనుకుంటాను."

"అంగీకరించాలి గాబట్టి, అంగీకరించాను."

"పోనీలే. మరినీవు బ్రదకటం ఎవరికోసం?" అని అడిగాను సూటిగా.

"నాకోసం మాత్రం కాదు. ఫలానావారి కోసమనిగాని, ఫలానా దానికోసమని గాని చెప్పలేను" అన్నాడు నవ్వుతూ.

"అయితే నీ విషయం నీకే తెలియదన్న మాట."

"తన విషయం తను తెలుసుకోగలిగిన వాడెవడు?"

"నీవు ఇంతకుముందు చెప్పిన వాళ్ళే. స్టాలిన్, గాంధీ మొదలైనవాళ్లు."

"ఎలా?"

"వాళ్ళకు తెలుసు వాళ్ళ లక్ష్యమేమిటో. నీకు అది తెలియదు"

"అది తెలియకపోయినా, దేనికోసం బ్రతకటం లేదో తెలుసుగా" అన్నాడు.

"అసంపూర్ణంగా ఒక విషయాన్ని గురించి తెలుసుకోవటం చాలా ప్రమాదాలకు దారి తీస్తుంది."

"ఒక విషయంలోనుంచి మరొక విషయంలోకి పోతున్నావు" అన్నాడు ఒక్కసారిగా.

"అసలు వాదనే అలాంటిది."

"అదుగో. మరొకవిషయంలోకి పోయావు"

"తప్పదు గనుక"

"అసలు నీతో వాదించటమే తప్పు" అన్నాడు చివరకు.

"థాంక్స్" అన్నాను వెంటనే.

* * *

ఎదుటివాడు చెప్పిన విషయం సబబుగా ఉన్నదని తోచినా, వాడు చెప్పినది అర్థమయినా, చాలా సమంజసంగా కనుపించినా, చాలామంది అంగీకరించామని చెప్పరు. మనస్సులో అంగీకరిస్తారు. బయటకు చెప్పటానికి జంకుతారు. అంగీకరించామని అంగీకరించటానికి భయం.

చేసింది చేసినట్టు చెప్పుకోవటానికి భయం. గౌరవానికి భంగం. మర్యాదకు లోపం. ఒక పని మనం చేసినపుడు, అదిచేశామని మనం చెప్పుకుంటే, చేసినదానికంటే ఎక్కువ పాపం చుట్టుకోదు. ఎక్కువ నష్టంలేదు.

ప్రతి విషయంలోనూ అంతే. మనం స్వార్థపరుల మయినపుడు, మనం స్వార్థపరులమేనని అంగీకరించితీరాలి. మనం అంగీకరించక పోవటమనేది ఒక నేరం క్రిందకు వచ్చితీరుతుంది. అదే దొంగతనం. నీవుచేసినపని, నీకు ఇష్టంలేకుండా గ్రహించినవాడు నిన్ను 'దొంగ' అంటాడు. ఆ విషయం కాని, ఆపని కాని పూర్తిగా నీకు సంబంధించిందే కావచ్చు. కాని అంత మాత్రాన అది దొంగతనం కాకమానదు. "మేము జీవించేది మాకోసం" అని చెప్పుకోవటానికి సిగ్గు వాళ్ళందరికీ. భయం. గౌరవానికి భంగం. ప్రతిరోజూ మనం చూసేవాళ్ళలో చాలామంది వాళ్ళకోసమే జీవించేవారు. వాళ్ళు చేసే ప్రతిపనీ వాళ్లకోసమే. పెళ్ళయినవాడూ అంతే. పెళ్లికానివాడూ అంతే. పిల్లలున్నా. లేకపోయినా కూడా అంతే.

ప్రతిరోజూ మనం చూసేవాళ్ళందరూ తమకోసమే జీవించే వాళ్లయినా వాళ్ళలో చాలా భేదాలున్నయ్. పైనచెప్పినట్లు మరొకరికోసం బ్రతుకుతున్నామని చెపుతూ, తమకోసం తాము బ్రతికేవాళ్ళు ఒకరకంవారు.

మరికొందరున్నారు- వాళ్ళకు మరింకేదీ బ్రతుకు తెరువు లేక ఈ మార్గంలో పడినవారు. వాళ్ళకోసం, వీళ్ళకోసం మా జీవితాలు ధారపోస్తాం, అంకితాలు చేస్తాం, వాళ్ళశ్రేయస్సే మా శ్రేయస్సు అనేవాళ్లు. రెండోరకంవాళ్లు, ఈ ప్రపంచంలో మరేవిధంగానూ తమకు తృప్తికలిగే విధానం కనుపించక ఈ రకం జీవితంలో ప్రవేశిస్తారు. ఈ జీవితానికి అలవాటు పడిన తరువాత కీర్తి, ధనమూ, అన్నీ సంపాదిస్తారు. కాని ప్రపంచంలో చెప్పుకోవటం మాత్రం, వీళ్ళందరూ ప్రపంచం కోసం తమ నిండుజీవితాలను ధారపోసి మంటగలిపినట్లు.

మూడోరకం వాళ్ళను అసలు భరించలేం. మొదటిరకం వాళ్లలో చాలామంది ఈ రకానికి



కూడా చెందుతారు. వాళ్ళందరూ గతచరిత్రను జ్ఞాపకం తెచ్చుకొని దానినే స్మరించేవాళ్లు. వాళ్లు చాలా ఎక్కువగా కనుపిస్తుంటారు. వయస్సు దాటిన వాళ్ళలో చాలమంది ఈ విధంగా మారిపోతారు. వాళ్ల చిన్నతనంలో, వాళ్ళు బడికిపోయే రోజుల్లో, వాళ్లు కాలేజీకి పోయే రోజుల్లో వాళ్ళ యౌవ్వనపు రోజుల్లో వాళ్ళ పెళ్ళయిన క్రొత్తలో ఎంత ఆనందంగా, హాయిగా, నిర్విచారంగా, నిరామయంగా ఉండేదీ వర్ణిస్తుంటారు. వాళ్లలో చాల మంది పనిలేనివాళ్ళు. వాళ్ళ కసలు ఇదే పని. జరిగిపోయిన రోజులను గుర్తుకు తెచ్చుకోవటమే వాళ్ళపని. ముసలివాళ్ళలోనూ, రిటైరైన ఉద్యోగస్థులలోనూ, ఇటువంటి రకానికి చెందిన వాళ్లను ఎక్కువగా చూస్తుంటాం. ఎందుకూ పనికిరానివాళ్లు, అంటే ఏ పనీ చేయలేనివాళ్లు, ఒక్క చిల్లిగవ్వ కూడ సంపాదించలేనివాళ్లు, అంగవైకల్యం కలవాళ్లు అందరూ ఈ రకం వాళ్ళే.

వాళ్ళు అస్తమానమూ గతాన్ని గురించే స్మరించటానికి ఒక్క కారణం స్పష్టంగా కనుపిస్తుంది. వాళ్లందరకూ భవిష్యత్తు శూన్యంగా కనుపిస్తుంది. కనుపించటమే గాదు. అసలు శూన్యమే. ఒకవేళ భవిష్యత్తులో ఏమైనా సాధించినా గూడ, గత జీవితంలో సాధించిన దానికంటె ఎన్నో రెట్లుతక్కువయి తీరుతుంది. గతంముందుభవిష్యత్తు అత్యల్పంగా కనిపిస్తుంది. అటువంటప్పుడు మానవుడు గతాన్ని స్మరించటం ప్రారంభిస్తాడు. భవిష్యత్తు గతంకంటె బాధాకరంగనుక ఆనంద పూరితమైన గతాన్నే స్మరిస్తాడు.

భవిష్యత్తునుగురించి ఆలోచించటానికి కావలసిన ధైర్యం, స్థయిర్యంలేక, ఈపనికి పాల్పడతారు పైరకంవాళ్లందరూ. నిజానికి ప్రతివాడూ అదే వయస్సులో, అదే పరిస్థితులలో అదే విధమైన అనుభవాలకు లోనవుతాడు.

చిన్నతనంలో ప్రతివాడు నిశ్చింతగా జీవిస్తాడు. యౌవ్వన దశలో ప్రతివాడూ తప్పకుండా ప్రేమిస్తాడు. ప్రేమించబడతాడు. ఒక్కొక వయస్సులో ఒక్కొకపరిస్థితిలో ధనం సంపాదిస్తాడు. మరో వయస్సులో, మరో పరిస్థితిలో ధనం వ్యయం చేస్తాడు. ప్రతి మానవుడూ అటువంటిపని చేస్తాడు. గతంలో జీవించిన మానవులందరూ అవే పనులుచేశారు. వర్తమానంలో జీవిస్తున్న మానవులందరూ అవే పనులు చేస్తున్నారు. భవిష్యత్తులో జీవించబోయే మానవులు కూడా అవేపనులు చేస్తారు.

కాబట్టి "నా చిన్నతనంలో నేను నిశ్చింతగా ఉండేవాడిని. నీలా ఉండేవాడినా? ఎంత చలాకీగా ఉండేవాడిని." అని ఒకవయస్సుమీరిన మనిషి తనకంటే చిన్నవాడితో అనటంలో పైన చెప్పినదానికంటే ఎక్కువఅర్థం ఉన్నట్లు కనుపించదు.

నాలుగో రకంవాళ్లు మరీ విచిత్రమైనవాళ్లు. తాము చేసేపని లేకపోయినప్పటికీ, తమకు మరణం ఆసన్నమైనప్పటికీచావకుండాఉంటారు కొందరు. వాళ్ళకు చావంటే భయం. చచ్చే సమయంలోగాని, చచ్చేటందుకుగాని ఎంత బాధ పడాలోనని వారి భయం ఆ తరువాత ఏబాధా ఉండదనీ తెలుసు. ఏనాడో ఒకనాడు ఆబాధ పడాలనీ తెలుసు. అయినా జీవించటం మీద ఆశ నశించదు.

భాగ్యవంతులు ఎక్కువగా ఈ రకానికే చెందుతారు. జీవించటంకోసం ఎంత ధనమైనా వెచ్చిస్తారు. మరీ ఈనవ్య నాగరికత, విజ్ఞానమూ ప్రబలిన కాలంలో ఈ కోరిక పైన చెప్పిన లక్షణాలుగల భాగ్యవంతులలో విపరీతంగా పెరిగింది.

ఈ విధంగా జీవించే మానవులు అనేక రకాలు. దృక్పథాల ననుసరించి, రకాలు లక్షణాలు మారుతుంటయ్.

ఉన్నవాటిని ఉన్నట్లు అంగీకరించరు చాలా మంది. ఆవిధంగా అంగీకరించటం నిజంగా కష్టం. ఆవిధంగా అంగీకరించేవాళ్ళని చూస్తే, అంగీకరించనివాళ్ళకు అసూయ. దాని ఫలితం కోపం.

నా మిత్రుడికీ నాకూ మధ్య అదే జరిగింది. ఆరోజు నిజంగా నామీద అతనికి కోపం వచ్చింది. వచ్చిందని నా కానాడు తెలియలేదు. తరువాత కొన్నాళ్ళకు గాని తెలిసింది